క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఎస్‌ఐ శివానందం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివానందం

తూప్రాన్: చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శివానందం అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో షీటీం, భరోసా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు యుక్త వయస్సులో వివిధ అంశాల పట్ల ఆకర్షితులు అవుతారని, చెడు, మంచిని గ్రహించి ముందుకు వెళ్లాలన్నారు. సెల్‌ఫోన్లతో అనేక తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. చదువుల్లో మంచి ప్రతిభ కనబరిచి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే షీటీం నంబరు 8712657963కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సభ్యురాలు స్వరూప, భరోసా సభ్యులు సౌందర్య, శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్లలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్ అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత

ఎమ్మెల్సీ రాజు జన్మదినం సందర్భంగా దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ ఆంజనేయస్వామి నిత్య అన్నదానానికి సరుకులు అందజేశారు. 5క్వింటాళ్ల బియ్యం, క్వింటాలు కందిపప్పు, 30లీటర్ల వంటనూనె, ఇతర సరుకులు ఆంజనేయశర్మ, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణకు అందజేశారు.

మానేసిన విద్యార్థులు బడిలో చేరాలి

ఎంఈఓ విఠల్



విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): చదువు మధ్యలో మానేసి, బడిబయట ఉన్న విద్యార్థులు చేరాలని మండల విద్యాధికారి విఠల్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాందాస్‌గూడ, బట్టు తండా, గంగిరెదుల్లగూడెం, సోమక్కపేట్‌లో స్థానికులతో శనివారం సమావేశాలు నిర్వహించారు. బడిమానేసిన విద్యార్థులను తప్పకుండా బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం ఆయన పాఠశాలలను తనిఖీచేసి, విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి



తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

పాపన్నపేట(మెదక్): ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ వెంటనే ప్రకటించాలని తపస్ మండల శాఖ అధ్యక్షులు నర్సింలు డిమాండ్ చేశారు. శనివారం తపస్ క్యాలండర్‌ను ఎంఇఓ ప్రతాప్ రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, కుర్తివాడ, కొత్తపల్లి హెచ్‌ఎంలు శ్రీనివాస్ రావు, దత్తురెడ్డి, టీచర్లు తులసి రాం, రాజశేఖర్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, కనకారెడ్డి, అనిల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించారు.. రోడ్డు మరిచారు

- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- ఇబ్బంది పడుతున్న తండా వాసులు
- పట్టించుకోని అధికారులు



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన బ్రిడ్జి



అధ్వానంగా కొచ్చెరుతండాకు వెళ్లే మట్టి రోడ్డు

హవేళిఘణాపూర్(మెదక్): కొచ్చెరుతండా–పాతూరు వెళ్లే రోడ్డు మధ్యలో వాగుపై వంతెన నిర్మించినప్పటికీ తండా వాసులకు అవసరమైన రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. కొచ్చెరువుతండా పంచాయతీ శివారులో గత ప్రభుత్వ హయాంలో రూ. 1.60 లక్షలతో బ్రిడ్జిని నిర్మించారు. దీంతో కొంతమేర ఇబ్బందులు తప్పినా వర్షాకాలంలో రోడ్డు సౌకర్యం లేక తండావాసులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెదక్ పట్టణం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఔరంగాబాద్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పాతూర్ ఆర్‌అండ్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

- మండల పరిధిలోని ఔరంగాబాద్ నుంచి కొచ్చెరువుతండా, కొచ్చెరుతండా నుంచి పాతూరు గేటు వరకు 4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- ఈ బీటీ రోడ్డు నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ తరఫున 2.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు, 4 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.
- రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించినా ఇంత వరకు పనులు కొనసాగడం లేదు.
- ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే రెండు తండాలకు చెందిన ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.
- కొచ్చెరుతండా, ఔరంగాబాద్ బీటీ రోడ్డు పాతూర్ నుంచి లంబాడి తండా వరకు సుమారు 4 కిలోమీటర్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాకు రోడ్డు నిర్మాణం చేపట్టి రవాణా సౌకర్యం మెరుగుపరచాలని తండావాసులు కోరుతున్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నిజాంపేట(మెదక్): నిజాంపేటలో టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ



వెల్దుర్తి(తూప్రాన్): క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నిజాంపేట(మెదక్): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నిజాంపేట మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాధికారి సాంగని యాదగిరి క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఉమ్లా నాయక్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సంఘ సభ్యులు రవీందర్, రవీందర్ రెడ్డి, వెంకటస్వామి, మహేందర్, ప్రవీణ్, కృష్ణ, గణేష్, సాగరిక, మన్మధ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్)లో..

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎంఈఓ లీలావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మపురి, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా, మండల కార్యదర్శి స్వప్న, జిల్లా కార్యదర్శి సాయిబాబ, సీనియర్ నాయకులు మధుసూదన్, నరేందర్‌రావ్, రాజేశ్వర్‌రావ్, భాగ్యలక్ష్మి, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్)లో...

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వద్ద టీపీటీఎఫ్ క్యాలండర్, డైరీలను ఎంఈఓ మల్లేశం శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్, మండల అధ్యక్షులు నర్సింగం, ప్రధాన కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్)లో...

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం టీపీటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు కాముని రమేశ్ ఆధ్వర్యంలో ఎంఈవో మధుమోహన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు రాజశేఖర్, కొమ్మ శ్రీనివాస్, ఓంకార్, శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, గంగమ్మ, భరత్, సందీప్ తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



చిలప్‌చెడ్(నర్సాపూర్): క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ, ఉపాధ్యాయులు



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మండల విద్యాధికారి విఠల్, కాంప్లెక్స్ హెచ్‌ఎం వేదశ్రీ, ఎస్‌ఐ నర్సింహులు చేతుల మీదుగా పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం శ్రమిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బుచ్చి రాములు, గౌరవ అధ్యక్షుడు మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు శర్వన్, మహిళా ఉపాధ్యక్షురాలు వాణిదేవి, ఉపాధ్యాయులు ధన్‌సింగ్, విజయ్, నర్సింలు, జిల్లా నాయకులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో...

అల్లాదుర్గం(మెదక్): పీఆర్టీయూ క్యాలెండర్‌ను అల్లాదుర్గం మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఎంఈఓ ధనుంజయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి రంజ్యానాయక్, హెచ్‌ఎంలు రవికుమార్, రమేశ్, నర్సింలు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, కిష్టయ్య, నాగరాజు, నాగభూషణం, రాజు, స్వప్న, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి



రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు తమ ఫోన్ల రికవరీ కోసం సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. నర్సాపూర్ సీఐ కార్యాలయంలో సర్కిల్ పరిధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసిన ఫోన్లను శనివారం పోలీసులు అప్పగించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ...మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే రికవరీ చేసేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఫోన్ల రికవరీ కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే ప్రతీ ఒక్కరు బిల్స్‌తోపాటు ప్యాకింగ్ డబ్బాలపై ఉన్న ఐఎంఈఐ నంబర్ జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఫోన్ పోయిన సమయంలో ఆ నంబర్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, కొడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- సీబీఐ హైదరాబాద్ జోన్ జీఎం ధారాసింగ్ నాయక్



బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ధారాసింగ్ నాయక్

రామాయంపేట(మెదక్): ప్రజలు బ్యాంక్ సేవలను సద్వినియోగపర్చుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ) హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్ దారాసింగ్ నాయక్ సూచించారు. శనివారం రామాయంపేటలో బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రామాయంపేటలో 1971లో సీబీఐ ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి అంచలంచెలుగా ఎదిగి అందరికీ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. సామాన్యులు, రైతులు సైతం బ్యాంక్ సేవలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. మధ్య తరగతి వ్యాపారులకు వ్యాపారాల నిమిత్తం రుణాలు అందజేశామని పేర్కొన్నారు. ఉద్యోగులు, ప్రజల సహకారంతో బ్యాంక్ అభివృద్ధి దిశలో పయనిస్తోందని పేర్కొన్నారు. బ్యాంక్ వరంగల్ జోన్ హెడ్ కృష్ణమోహన్, రామాయంపేట బ్యాంక్ మేనేజర్ భీముడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

108 సేవలు వినియోగించుకోండి

రేగోడ్(మెదక్): 108 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో శనివారం నూతన 108 అంబులెన్స్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావుతో ఆయన కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు మాటిచ్చి నిలబెట్టుకున్నామని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్యారోగ్య అండ్ సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రేగోడ్‌కు నూతన 108 అంబులెన్స్‌ను పంపించడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వికాస్, ఎస్‌ఐ పోచయ్య, కాంగ్రెస్ గ్రామఅధ్యక్షుడు శంకరప్ప, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్లు శ్రీధర్ గుప్తా, గంజి సంగమేశ్వర్, కోఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, కృష్ణ, చక్రపాణి, భస్వరాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన బాలకృష్ణ



మహేష్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బాలకృష్ణ

మెదక్‌జోన్: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత ఎం. బాలకృష్ణ శనివారం గాంధీభవన్‌లో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

ఈనెల 6 నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 6నుంచి 10 వరకు సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏప్రిల్1, 2023 నుంచి మార్చి31, 2024 వరకు ఉపాధిహామీ, పంచాయతీరాజ్, అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రూ. 9కోట్లకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. 6న భుజిరంపేట, రాయిలాపూర్, వెల్మకన్న, తిమ్మాపూర్, కంచన్‌పల్లి, ధర్మాసాగర్, కుషన్‌గడ్డతండా, సలాబత్‌పూర్, కొత్తచెరువుతండా, సదాశివపల్లి, 7న కొట్టాల, తునికి, ముత్రాజ్‌పల్లి, నాగ్సాన్‌పల్లి, 8న కూకుట్లపల్లి ఇతర గ్రామాల్లో సభను నిర్వహిస్తారు.

హెల్మెట్ లేకుంటే చర్యలు తప్పవు

- అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రేణుకారెడ్డి



కౌడిపల్లిలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి



వెల్దుర్తి: డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): ఇక నుంచి ద్విచక్ర వాహనదారుల ఎవరైనా హెల్మెట్ లేకుండా నడిపితే చర్యలు తప్పవని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి హెచ్చరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం టేక్మాల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వాహనదారులకు, ప్రయాణికులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రైవేటు వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. మద్యం తాగి, లేదా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. వాహనాల తనిఖీల్లో భాగంగా అవసరమైన పత్రాలు లేని, నంబర్‌ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం కౌడిపల్లిలో ఆటోడ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవద్దన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయానికులను ఎక్కించవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించి జాగ్రత్తగా వాహనాలు నడపాలని చెప్పారు. వేగం కన్నా గమ్యస్థానం ముఖ్యమని గుర్తించుకోవాలని చెప్పారు. మీపైన ఆధారపడిన కుటుంబం మీకోసం ఇంటివద్ద ఎదురుచూస్తుందన్న విషయం మరవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కనకచంద్రం పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

వెల్దుర్తి(తూప్రాన్): మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజు హెచ్చరించారు. మండల కేంద్రం వెల్దుర్తి అంబేద్కర్ చౌరస్తాలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యంతాగి వాహనం నడపడం వలన కలిగే అనర్థాలు, హెల్మెట్‌తో కలిగే ఉపయోగాలను వాహనదారులకు వివరించారు.

కొత్త పంచాయతీని ఏర్పాటు చేయండి



రాజిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ఫైజాబాద్ గ్రామ పంచాయతీలో ఉన్న నాలుగు తండాలను కలిపి ఒక కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామ నాయకులు శనివారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫైజాబాద్ పరిధిలోని ఎలుగుట్ట, కొత్తకుంట, తుల్జ్యా, తార్య తండాలు పంచాయతీకి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. చాలా కాలంగా ఫైజాబాద్ పరిధిలో ఉన్న తండావాసులు పంచాయతీ పనుల కోసం తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. తమ ఇబ్బందులు తీర్చేలా నాలుగు తండాలను కలిపి ఒక నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్, శివాజీ నాయక్, శశికాంత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘం ఏర్పాటు చేయండి

చిలప్‌చెడ్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు ఏకైక సహకార సంఘం సోమక్కపేట్‌లో ఉంది. దూరంగా ఉన్న గ్రామాలకు ఇబ్బందిగా మారింది. అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, గంగారం, జగ్గంపేట గ్రామాలను కలిపి నూతన సహకార సంఘం ఏర్పాటుకు సహకరించాలని రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘం భవనానికి స్థలం కూడా సిద్ధంగా ఉందని అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరుశురాంరెడ్డి అన్నారు.

సహకార సంఘం ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శివ్వంపేట (నర్సాపూర్): గోమారంలో ప్రాథమిక సహకార సంఘం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రారెడ్డి మాట్లాడారు. 1962లోనే గోమారంలో విశాల పరపతి సహకార సంఘం 11 రెవెన్యూ గ్రామాలతో ఏర్పాటు చేసి, 100 మంది ఖాతాదారులతో పని చేసిందన్నారు. 1987లో వ్యవసాయ సహకార సంఘంగా పేరు మార్చి సొంత భవనం నిర్మించారని చెప్పారు. 2006లో గోమారం వ్యవసాయ సహకార సంఘం రద్దు చేసి శివ్వంపేటలో కలపడం జరిగింది. ప్రస్తుతం మేజర్ పంచాయతీగా గోమారం ఉండడంతో పాటు సమీప గ్రామాల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినందున గోమారంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోమారంలో సొంత భవనం ఉన్నందున ప్రాథమిక సహకార సంఘం ఏర్పాటు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సాపూర్ రూరల్: బాధిత కుటుంబ సభ్యులకు శనివారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సుమారు రూ 4.61 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. చెక్కులను అందుకున్న వారిలో హత్నూర, చిలిపిచెడ్, కౌడిపల్లి, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వారున్నారు.

గౌతాపూర్‌లో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్‌కు చెందిన ఎస్.మాణిక్యరెడ్డికి రూ.60 వేలు, చాకలి విఠల్‌కు రూ.39 వేలు చొప్పున సీఎంఆర్‌ఎఫ్ కింద చెక్కులను ఆ గ్రామ నాయకుడు విఠల్‌కు అందజేశారు.చిలప్‌చెడ్‌లో చిల్వెర వెంకటేశంకు రూ.82 వేల చెక్కును బీఆర్‌ఎస్ నాయకుడు దుర్గారెడ్డి అందజేశాడు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ హన్మంత్, తదితరులు పాల్గొన్నారు.

◆ గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల మాజీ సర్పంచ్ ఆది లక్ష్మణ్ (70) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. లక్ష్మణ్ బోనాల గ్రామ సర్పంచ్‌గా 1980లో ఒక మారు, 2001 నుంచి 2006 వరకు మరోమారు సర్పంచ్‌గా సేవలందించారు. మాజీ సర్పంచ్ మృతికి పలువురు ప్రజా ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. సికింద్రాబాద్ సుచిత్రలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు పేర్కొన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నర్సాపూర్ రూరల్: ఎమ్మెల్యే సునీత రెడ్డి శనివారం తన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రాలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. నర్సాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఉప్పలపు మల్లేశంకు రూ 2 లక్షలు, కౌడిపల్లి మండలం దేవులపల్లికి చెందిన రామయ్యకు రూ లక్ష విలువగల ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సునీతా రెడ్డి అందజేశారు.

◆ బూర్గుపల్లి మాజీ సర్పంచ్ కన్నుమూత

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ లెంక కిష్టయ్య(55) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. బూర్గుపల్లి గ్రామ సర్పంచ్‌గా 1995 నుంచి 2012 వరకు మూడు పర్యాయాలు పని చేసి మరో ఐదేళ్లు ఎంపీటీగా ప్రజలకు సేవలందించారు.

◆ ఎన్నికలకు సహకరించండి

నర్సాపూర్ రూరల్: ఉమ్మడి జిల్లా ఖోఖో ఎన్నికలకు క్రీడాకారులు సహకరించాలని జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోషప్ప, నాగరాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు.